క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

నకరికల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని సూచించారు. అభివృద్ధి అంశాలపై చర్చించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

వీఆర్‌ఏపై దాడి తగదు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ కోరబండి శ్రీనివాసరావుపై దాడి చేసిన సత్తెనపల్లి తహశీల్దార్ కె.నగేష్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని సీఐటీయూ సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బందగి సాహెబ్ అధ్యక్షతన బుధవారం జరిగిన జిల్లా విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ సత్తెనపల్లి నాయకులు, వీఆర్‌ఏల సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా శ్రీనివాసరావు



ముప్పాళ్ళ: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వ్యవహరించనున్నారు. ఆ మేర బుధవారం జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ప్రస్తుత ఎంపీడీవో పి.పుట్టారెడ్డి ఉన్నత చదువుల నిమిత్తం సెలవుపై వెళ్ళటంతో శ్రీనివాసరావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు.

సీజనల్ హాస్టళ్ల ప్రారంభం

రాజుపాలెం: సీజనల్ హాస్టళ్లు విద్యార్థులకు ఉపయోగకరమని, తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఎంఈఓ మల్లికార్జునశర్మ తెలిపారు. కొండమోడు సమీపంలోని సమగ్ర శిక్షణ ఉత్తర్వుల మేరకు దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట ఆధ్వర్యంలో సీజనల్ హాస్టళ్లను ఎంఈఓ బుధవారం ప్రారంభించారు. ఈ సీజనల్ హాస్టళ్లలో ఉచిత బోధన, ఉచిత భోజనం సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ అధ్యక్షతన గురువారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

ఏఎంసీ డైరెక్టర్లకు సత్కారం



సత్తెనపల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఇటీవల నియమితులైన ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన షేక్ మస్తాన్ బీ, షేక్ జానమ్మలను కలాం చేయూత వ్యవస్థాపక అధ్యక్షులు వెలుగురి శరత్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో సత్కరించారు. ఏపీపీ బగ్గి నరసింహారావు, షేక్ గని మాట్లాడుతూ డైరెక్టర్లుగా మైనార్టీలకు అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సయ్యద్ ఖాజా, షేక్ యూనస్, సహారా మౌలాలి, షేక్ మహిబుల్లా,షేక్ కరిముల్లా, షేక్ గుంటూరు జానీ, షేక్ మస్తాన్, జూపల్లి పాల్, ఉల్లంగుల ప్రసాద్, పెద్దింటి నాగేశ్వరరావు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు నియామకపత్రాలు

రాజుపాలెం: రాజుపాలెం, బలిజేపల్లి, అంచులవారిపాలెం గ్రామాలకు ఆశా కార్యకర్తలను నియమించారు. ఈ మేరకు నామాల ప్రసన్నలక్ష్మీ(రాజుపాలెం), సీహెచ్ ప్రమీల,(బలిజేపల్లి), అంచుల అంజలి (అంచులవారిపాలెం)కి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.వెంకటకృష్ణకుమార్ బుధవారం నియామక పత్రాలు అందజేశారు.

నవ్వులు కురిపించెను



సత్తెనపల్లి ఒకటవ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం



క్రోసూరులో..



కంటెపూడిలో..



తాళ్లచెరువులో..



చాగంటివారిపాలెంలో..



తురకపాలెంలో..

ఊరూవాడా పెన్షన్ల పండగ

సత్తెనపల్లి/క్రోసూరు/అచ్చంపేట/ముప్పాళ్ళ/నకరికల్లు: వైఎస్సార్ పెన్షన్ కానుక బుధవారం వేకువ జామునే లబ్ధిదారుల తలుపుతట్టింది. అవ్వాతాతల మోముల్లో నవ్వులు కురిపించింది. ముంగిళ్లలో సంతోషాలు నింపింది. సత్తెనపల్లి ఒకటో వార్డులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు పాల్గొన్నారు. వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావుతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, నాయకులు షేక్ గని, మౌలాలి, కరిముల్లా, దావీదు, తోట వెంకటేశ్వర్లు, అవ్వారు శ్రీను పాల్గొన్నారు.

● సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామంలో ఎంపీపీ షేక్ ఎలవర్తి పాటి జై బూన్ బీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళ విజయభాస్కర్ రెడ్డి, సంకటి శ్యాంసన్, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, నాయకులు జంగా చంద్రశేఖర్‌రెడ్డి మందాళ శంకరారెడ్డి, ఈపరాపట్నం బొబ్బిలి, కళ్ళం రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● క్రోసూరు మండలంలో తొలిరోజు 60 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తిచేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య తెలిపారు. మొత్తం 8,573 మంది లబ్ధిదారులు ఉండగా, తొలిరోజు 5,143 మందికి అందించినట్లు వివరించారు.

● అచ్చంపేట మండలం తాళ్లచెరువులో జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ కిక్కురు అర్లారెడ్డి, ఎంపీటీసీ గోపు అంతోనిరెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం జెడ్పీటీసీ పీహెచ్‌సీ ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు.

● ముప్పాళ్ల మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ తొలిరోజు 73 శాతం పూర్తయిందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో మొత్తం 6,037 మంది లబ్ధిదారులు ఉండగా, 4,451 మందికి పింఛన్ అందిందని వివరించారు.

● చాగంటివారిపాలెంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్ రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, చెక్కెర లక్ష్మీరెడ్డి, పీలా లక్ష్మణ్ పాల్గొన్నారు.

● నకరికల్లు మండలం తురకపాలెంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మద్దినేని దాసయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి తెలుగు యువత నేత



తెలుగు యువత ఉపాధ్యక్షుడు కిరణ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: తెలుగు యువత మండల శాఖ ఉపాధ్యక్షుడు యేపూరి కిరణ్ తన అనుచరులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీ నుంచి మొన్న కొత్తపల్లి మాజీ సర్పంచ్ దేవదానం, నిన్న మాదిపాడు మాజీ సర్పంచ్ కొరివి వెంకట్రామయ్య, నేడు తెలుగు యువత ఉపాధ్యక్షుడు యేపూరి కిరణ్ ఒక్కొక్కరుగా వచ్చి చేరుతున్నారని ఎమ్మెల్యే శంకరరావు తెలిపారు. టీడీపీకి కంచుకోటలుగా ఉన్న గ్రామాలలోనూ వైఎస్సార్ సీపీ ప్రభంజనం కనిపిస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ కంబాల వీరబాబు, బీసీ నాయకులు షేక్ జాని, కమల్‌సైదా, షేక్ సుభాని తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజల దాహార్తిని తీర్చేందుకు మదీనా ఫర్నీచర్స్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ జాని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం ప్రారంభించారు.

బాలుడి మృతదేహంతో రాస్తారోకో

నకరికల్లు: ప్రమాదానికి కారణమైన కారు యాజమానిని అరెస్ట్ చేసి రోడ్డుప్రమాదంలో మృతుని కుటుంబీకులకు న్యాయం చేయాలని బంధువులు ఆందోళన చేపట్టారు. స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై వై.జంక్షన్ వద్ద బుధవారం మృతదేహంతో రాస్తారోకో చేశారు. నకరికల్లుకు చెందిన మోరా నాగార్జునరెడ్డి (14) కారు ఢీకొని మంగళవారం మృతిచెందిన విషయం విదితమే. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన నకరికల్లు వై.జంక్షన్ వద్దకు బంధువులు తీసుకొచ్చి ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన కారు యజమానిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.సురేష్, సిబ్బంది హుటాహుటిన వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో మృతుని బంధువులు ఆందోళన విరమించారు.

విద్యార్థులు పరీక్షలు ఎదుర్కొంటేనే భవిష్యత్తు

డైరెక్టర్ ఆఫ్ గర్నమెంట్ ఎగ్జామినేషన్స్ దేవానందరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న దేవానందరెడ్డి

ఊటుకూరు(క్రోసూరు): విద్యార్థులు ఏటా పరీక్షలు ఎదుర్కొంటేనే భవిషత్ బాగుంటుందని డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డి.దేవానందరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన మండలంలోని ఊటుకూరు గ్రామంలోని జెడ్పీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రత్యేక సూచనలు ఇచ్చారు. ప్రణాళిక ప్రకారం చదివితే ఒత్తిడిని జయించవచ్చని వివరించారు. తన అనుభవాలను పంచుకున్నారు. పాఠశాలలో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.ప్రభాకరరావు, ఉపాధ్యాయుడు సీహెచ్ సురేష్ తదితరులు ఉన్నారు.

రోజుకు 20 వేల మందికి ఉపాధి పనులు కల్పించాలి

పల్నాడు జిల్లా డ్వామా పీడీ జోసఫ్ కుమార్

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సత్తెనపల్లి డివిజన్ వ్యాప్తంగా రోజుకు 20 వేల మందికి పనులు కల్పించాలని పల్నాడు జిల్లా డ్వామా పీడీ కె.జోసఫ్ కుమార్ చెప్పారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కూలీలకు పనులు కల్పించే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఏ మండలంలోనైనా లక్ష్యాలను చేరుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్తెనపల్లి మండలంలో 3 వేల మందికి, పెదకూరపాడు మండలంలో 2,500 మందికి, రాజుపాలెం మండలంలో 2,500 మందికి, నకరికల్లు, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, ముప్పాళ్ళ, అమరావతి మండలాల్లో 2,000 మందికి చొప్పున పనులు కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీడీ కె.రఘుకుమార్, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, సత్తెనపల్లి ఏపీఓ వెంకటనారాయణ, తొమ్మిది మండలాల ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘ డివిజన్ అధ్యక్షుడిగా సైదులు

సత్తెనపల్లి: ఏపీ వీఆర్వోల అసోసియేషన్ సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడిగా షేక్ సైదులు(క్రోసూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ది క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం సత్తెనపల్లి డివిజన్ కమిటీ ఎన్నికలు జరిగాయి. కార్యదర్శిగా టి.రాజబాబు (రాజుపాలెం), సహాధ్యక్షులుగా షేక్ జిలాని (బెల్లంకొండ), ఎల్.జయపాల్ (సత్తెనపల్లి), కోట మోహన్‌రావు (అచ్చంపేట), సంయుక్త కార్యదర్శులు పీవీ కోటేశ్వరరావు (నకరికల్లు), నాయుడమ్మ (పెదకూరపాడు), బంకా రవి(అమరావతి), కోశాధికారిగా ఎస్.అశోక్ (అచ్చంపేట) ఎన్నికయ్యారు.

ముఖ్య అతిథులుగా ఏపీ వీఆర్వో అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.వేదాంతరావు, ఉపాధ్యక్షుడు చిమటా పేరయ్య హాజరయ్యారు. ఎన్నికల అధికారులుగా ఏపీ వీఆర్వో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఆర్.రామారావు, నరసరావుపేట వీఆర్వో అసోసియేషన్ డివిజన్ నాయకులు కేపీ చారి వ్యవహరించారు. కొత్త కార్యవర్గానికి ఏపీ వీఆర్వో అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సిహెచ్.యువరాజు అభినందనలు తెలిపారు.

వైభవంగా సత్తెమ్మతల్లి, సత్యదేవుళ్ల కల్యాణోత్సవం

అచ్చంపేట: మాదిపాడు పంచాయతీ పరిధిలో, పులిచింతల ప్రాజెక్టు సమీపంలోని అడవిలో స్వయంభువుగా వెలసిన సత్తెమ్మతల్లి, సత్యదేవుడి కల్యాణోత్సవం యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. శాంతి హోమం, చండీయాగాలు చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అమ్మవారికి పూజలు జరిపించారు. ఈఓ కోటిరెడ్డి ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు.

వాకర్స్ క్లబ్ సభ్యులకు సత్కారం

సత్తెనపల్లి: పట్టణంలోని శివసదన్‌లో ఏజీకేఎం వాకర్స్ అండ్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దేవరశెట్టి రవికుమార్‌తోపాటు విజయవాడలో ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణా రివర్ స్విమ్మింగ్ పోటీలో మూడో బహుమతి గెలుచుకున్న నిమ్మగడ్డ హనుమంతరావును బుధవారం సత్కరించారు. వీరిద్దరూ తమ సంస్థ సభ్యులు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎం.వి సుబ్బారెడ్డి, సంస్థ అధ్యక్షుడు దాసరి కోటేశ్వరావు, సెక్రటరీ బత్తుల శ్రీనివాస్, ట్రెజరర్ ఇ.సోమశేఖర్ పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం బుధవారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు ఎస్.సూర్యప్రకాశరావు పాల్గొని 139 మందికి వైద్యసేవలందించారు. పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పీటర్ డానియేల్, జోస్పిన్‌రాణి, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, డీఈఓ రవితేజ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

ముప్పాళ్ళ: తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో పురుగుమందు తాగిన విద్యార్థిని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇరుకుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మోపర్తి దివ్య(16) ఫిరంగిపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతుంది. గత వారం ఇంటికి రాగా తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభి రామయ్య తెలిపారు.

సామాజిక తనిఖీలపై అవగాహన

ముప్పాళ్ళ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులను పరిశీలించేందుకు తనిఖీ బృందాలు ఈనెల 2 నుంచి గ్రామాల్లో పర్యటిస్తాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీలపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో మండలంలో మొత్తం 341 పనులకు రూ.9కోట్ల 33 లక్షల మేర పనులు జరిగాయని వివరించారు. ఈ పనుల తనిఖీకి మూడు బృందాలను నియమించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రామారావు, ఎంఈఓ ఒంగోలురాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జేఎమ్ రామలింగారెడ్డి, ఎస్ఆర్‌పీ పున్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం..ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- కోనూరులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: హామీలన్నీ నెరవేర్చామని, మళ్లీ ఆశీర్వదించి మరింత అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రజలను కోరారు. కోనూరులో బుధవారం రాత్రి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగు నీటి సమస్యకు పరిష్కారం కోసం జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయిలు మంజూరు చేస్తున్నట్టు వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో అంతర్గత సిమెంట్ రోడ్లు, డ్రెయినేజ్ నిర్మించే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గత 30 ఏళ్లలో గ్రామంలో ఎన్నడూ జరగని అభివృద్ధి మూడున్నరేళ్లలో చేసి చూపించామని పేర్కొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

రూ.15 లక్షల అంచనా వ్యయంతో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులకు ఎంతో సంతోషపడిన గ్రామస్తులు పసుపులేటి జాలయ్య ఆధ్వర్యంలో వెండి కిరీటం, వెండి ఖడ్గంతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావును సత్కరించారు.

టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్ సీపీలోకి..

కోనూరు గ్రామంలో ఎస్సీ కులానికి చెందిన పలు కుటుంబాల వారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానం పలికారు. తామంతా ఇప్పటి వరకు టీడీపీలో ఉన్నా, పార్టీ భేదం చూపకుండా అనేక సంక్షేమ పథకాలు అందజేశారని, ఒక్కొక్క కుటుంబానికి ఏడాదికి సుమారు లక్ష రూపాయలకుపైగా లబ్ధి చేకూరిందని వారు వివరించారు. పార్టీలో చేరిన వారిలో కొమ్మవరపు మార్కు, ఇబ్రహీం, అంకమ్మరావు, రాజేష్, డేవిడ్‌రాజు, ఎలగాల నాగేశ్వరరావు, కోటయ్య, నరసింహారావు, గుడిపూడి నరసింహారావు తదితరులు 60మంది ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీటీసీ యండ్రపల్లి నటరాజు, మాజీ సర్పంచ్ వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, పసుపులేటి జాలయ్య, పి.శ్రీనివాసరావు, వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సాయిరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, ఉప ఎంపీపీ గంగసాని బాబు, మత్తా శ్రీనివాసరావు, గుడేటి శ్యాంసన్, అచ్చంపేట ఉప సర్పంచ్ షేక్ జాని తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజుపాలెం ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన కొండ్రెడ్డి సుజాత



ప్రమాణ స్వీకారోత్సవ వివరాలు వెల్లడిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజుపాలెం: రాజుపాలెం మార్కెట్ యార్డు కొత్త పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవం గురువారం సాయంత్రం ఐదు గంటలకు జరగనుందని, చైర్మన్‌గా కొండ్రెడ్డి సుజాత బాధ్యతలు చేపట్టనున్నారని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమానికి ఏఎంసీ గౌరవ అధ్యక్షులు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షత వహించనున్నారని వివరించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నెల్లూరు శాసన సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నంబూరు శంకరరావు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఏఎంసీ చైర్మన్‌గా కొండ్రెడ్డి సుజాత, వైస్ చైర్మన్‌గా పూల ధనవంత్రి(కుంకలగుంట), డైరెక్టర్లుగా వేల్పుల లక్ష్మయ్య(ఉప్పలపాడు), నల్లగొర్ల తిరుపతమ్మ (అనుపాలెం), బత్తుల నాగేంద్రమ్మ(నెమలిపురి), దేవిరెడ్డి లక్ష్మీరెడ్డి(కోటనెమలిపురి), చికిలి మస్తాన్‌వలి(గుళ్లపల్లి), మూల ధనలక్ష్మీ (నర్సింగపాడు)కోర్నె మల్లేశ్వరి (రూపెనగుండ్ల) బెల్లంకొండ శివపార్వతి(నకరికల్లు), లింగాల చిన్నమ్మాయి(ఇనిమెట్ల), మురికిపూడి చిన్న నాగేశ్వరరావు(నకరికల్లు) ఎస్‌కె మహబూబ్‌కమల్ భాషా(రెడ్డిగూడెం),కాండ్రు భిక్షమయ్య(చాగల్లు), నిమ్మకాయల వీరాంజనేయులు(రాజుపాలెం), మేడికొండ మస్తాన్‌రెడ్డి(ప్రెసిడెంట్ పిఏసీఎస్ నకరికల్లు), పులిబండ్ల అశోక్(సర్పంచ్ రాజుపాలెం) ప్రమాణ స్వీకారం చేస్తారని వివరించారు. కార్యక్రమానికి హాజరయ్యే అతిథులకు ఘన స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.